సాక్షి
వికారాబాద్

శుక్రవారం, 16, జూన్, 2023



తవ్వకాలపై ఉక్కుపాదం

కాగ్నానదిలో కన్నడిగులు చేస్తున్న ఇసుక దోపిడీపై తెలంగాణ అధికారులు ఉక్కుపాదం మోపారు. 8లో▸



గ్రామాలకు మహర్దశ

పల్లె ప్రగతి కార్యక్రమంతో ద్వారా గ్రామాల రేఖలు మారాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. 8లో▸



స్వీట్‌కార్న్ సాగు..భలే బాగు

తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే మొక్కజొన్న పొత్తులు(స్వీట్‌కార్న్) సాగు అధికంగా సాగవుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: సెల్స్ రిప్రజెంటేటివ్స్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ విజయ బయోఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేటు కంపెనీలో 100 ఉద్యోగాల కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో ఈ నెల 17న ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం పురుషులు మాత్రమే 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. నెలకు రూ. 8000 నుంచి రూ. 12,000 వరకు వేతనం ఉంటుందన్నారు. ఇతర అలవెన్సులు కూడా వర్తింపజేస్తారని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96760 47444 ను సంప్రదించాలన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్స్ పరిశీలన



వీవీ ప్యాట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: ఎన్నికల నిర్వహణ కోసం ఉపయోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ను పుదుచ్చేరి డిప్యూటీ సీఈఓ బి. తిల్లయ్యోల్ పరిశీలించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న ఈవీఎం గోడౌన్‌లో భద్రపర్చిన ఓటింగ్ యంత్రాలను కలెక్టర్ నారాయణ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చిన ఎన్నికల సామగ్రిని ఒక్కొక్కటిగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీఓ విజయ కుమారి పాల్గొన్నారు.

ఆరేళ్ల చిన్నారిని పాడుబడిన ఇంట్లోకి లాక్కెళ్లి..

లైంగిక దాడికి యత్నించిన 55 ఏళ్ల వ్యక్తి

పరిగి: ఆరేళ్ల చిన్నారిపై 55 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి యత్నించిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారి తమ్ముడితో కలిసి ఓ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన బాలగల్ల సత్తయ్య(55) చిన్నారిని పక్కనే ఉన్న పాడుబడ్డ ఇంట్లోకి తీసుకెళ్లాడు. దీంతో ఆమె తమ్ముడు ఏడ్వడం ప్రారంభించాడు. అక్కడే ఉన్న రంజిత్, బాబు బాలుడిని ఆరా తీసి.. పాడుబడిన ఇంట్లోకి వెళ్లి చూడగా లైంగిక దాడికిపాల్పడుతున్న వ్యక్తిని పట్టుకుని చితకబాదారు. చిన్నారి తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సత్తయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

నీట్‌లో పరిగి విద్యార్థికి అన్యాయం

ఫలితాల్లో 251..
ఓఎంఆర్ షీట్‌లో 370 మార్కులు

పరిగి: నీట్ ఫలితాల్లో వికారాబాద్ జిల్లా పరిగి విద్యార్థికి అన్యాయం జరిగింది. పరిగి పట్టణ కేంద్రానికి చెందిన సాయిచరణ్ నీట్ పరీక్ష రాసాడు. వెలువడిన ఫలితాల్లో 251 మార్కులు వచ్చాయి. దీంతో అవాక్కైన సాయిచరణ్ వెంటనే ఆన్‌లైన్‌లో ఓఎంఆర్ షీట్‌ను తీసుకుని పరీక్షించాడు. ఓఎంఆర్ సీట్‌లో 370 మార్కులు రావడంతో తనకు అన్యాయం జరిగిందని వాపోతున్నాడు. సంవత్సర కాలం కష్టపడి చదివిందంతా వృథా అవుతుందని విద్యార్థి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఎక్కువ మార్కులు వస్తే తక్కువ వేశారని అన్నారు.

సుస్మితకు డీజీపీ అభినందన



సుస్మితను అభినందిస్తున్న డీజీపీ అంజన్‌కుమార్

షాద్‌నగర్: సివిల్ సర్వీసెస్‌లో జాతీయ స్థాయి 384 ర్యాంకు సాధించిన షాద్‌నగర్ పట్టణానికి చెందిన సుస్మితను డీజీపీ అంజన్ కుమార్ అభినందించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి వచ్చిన ఆమెకు పోలీస్ డైరీ అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి ర్యాంకు తెచ్చుకోవడం గొప్పవిషయమన్నారు. భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇప్పలపల్లి శ్రీశైలం, లక్ష్మీ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హస్తం గూటికి పట్నం!





దాదాపు చేరిక ఖరారు

- ఆయనతో పాటే సతీమణి కూడా..
- ఇప్పటికే కాంగ్రెస్ ముఖ్య నేతలతో భేటీ
- అనుచరులతో మంతనాలు
- సోదరుడు, అన్న కుమారుడి చేరికపై స్పష్టత కరువు

వికారాబాద్: మాజీ మంత్రి, అధికార పార్టీ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి హస్తం గూటికి చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ ముఖ్య నేతలతో చర్చించిన ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఆయనతో పాటే జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సైతం ఆయన బాటలోనే నడవనున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే జిల్లాలో తమ వర్గంగా ముద్ర పడిన నేతలందరినీ తమ వెంట కాంగ్రెస్‌లోకి రావాలని కోరడంతో పాటు వారితో సంప్రదింపులు జరుపుతున్నట్లు వినికిడి. కొడంగల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సోదరుడు నరేందర్‌రెడ్డి, షాబాద్ ఎంపీపీగా కొనసాగుతున్న ఆయన అన్న కుమారుడు అవినాశ్‌రెడ్డి పట్నం వెంట నడుస్తారా? లేదా? అనే విషయంలో స్పష్టత రాలేదని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా... మహేంద్రజాలం ప్రదర్శిస్తూ వచ్చిన ఈ మాజీ అమాత్యుడు ఉన్నట్టుండీ ఇటీవల సైలెంట్ అయ్యారు. ఇది వ్యూహాత్మక ఎత్తుగడలో భాగమేనంటూ ప్రచారం సాగుతూ వచ్చింది. మొదట బీజేపీలో చేరుతారనే ప్రచారం జరగగా తాజాగా హస్తం గూటికి వెళ్లేందుకు దాదాపు సిద్ధమైనట్టు సమాచారం. పొంగులేటి, జూపల్లి చేరికల అనంతరం వీరి చేరికలు ఉండే అవకాశం ఉందని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

సోదరుడి బాట ఎటో?

పట్నం మహేందర్‌రెడ్డి ఇటీవలి వరకు అవలంబిస్తూ వస్తున్న ఈ వ్యూహాత్మక ఎత్తుగడ వెనుక రెండు రెండు వ్యూహాలున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో తన బలం, బలగం, ప్రాబల్యం నిరూపించుకోవడం ద్వారా అధిష్టానం దృష్టిలో తన ప్రాధాన్యత పెంచుకోవడం ఒక ఎత్తుగడ.. ఇక రెండోది భవిష్యత్తులో ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల టికెట్ల విషయంలో మాట నెగ్గించుకోవాలని భావిస్తూ వచ్చినట్టు తెలుస్తోంది. అయితే తాండూరులో తనకు, పరిగి నుంచి టికెట్ ఆశిస్తున్న తన వర్గం నేత మనోహర్‌రెడ్డికి అధికార పార్టీ టికెట్లు దక్కవని స్పష్టత రావడంతో పార్టీ వీడాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అయితే మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఆయన వెనకాలే ఎలాగో నడవనుంది. కాగా సోదరుడు, కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, అన్న కుమారుడు షాబాద్ ఎంపీపీ అవినాశ్‌రెడ్డి మహేందర్‌రెడ్డి వెనకాల నడిచేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. వీరిద్దరితో కేటీఆర్ ఇప్పటికే మంతనాలు జరిపి బీఆర్ఎస్‌లో వారి భవిష్యత్తుపై హామీ ఇవ్వడం ద్వారా వారిని మహేందర్‌రెడ్డి వెనకాల వెళ్లకుండా చూడటంలో సఫలమయ్యారని తెలుస్తోంది.

అంతర్మథనంలో అనుచరగణం..

కొంతకాలంగా ఉమ్మడి జిల్లాలోని అధికార పార్టీలో పట్నం రెబల్ స్టార్‌గా మారారు. వికారాబాద్, తాండూరు, చేవెళ్ల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు వైరీవర్గంగా ఉంటూ వస్తున్న బీఆర్ఎస్ నేతలకు ఆయన నాయకత్వం వహిస్తూ వస్తున్నారు. వాస్తవానికి కూడా ఒకరిద్దరు మినహా అధికార పార్టీలో ఉన్న అసంతృప్త నేతలందరూ పట్నం బాటలో నడవటం కూడా ఇందుకు బలం చేకూరుస్తుంది. తాండూరులో ముందు నుంచే రెండు గ్రూపులు ఏర్పడగా గత ఏడాది కాలంలో వికారాబాద్, పరిగి, చేవెళ్ల నియోజకవర్గాల్లోనూ పార్టీ రెండుగా చీలిపోయింది. ఓ వర్గం నేతలు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వెంట నడుస్తుండగా వారి వైరీవర్గాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహేందర్‌రెడ్డి నాయకత్వం వహిస్తూ వస్తున్నారు. ఇక బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌లు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ వారు పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పట్నం వర్గానికి కూడా దూరంగా ఉంటూ వస్తున్నారు. వారం రోజులుగా మహేందర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి సునీతారెడ్డి వారి అనుచరగణంతో మంతనాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. తమతో పాటు కాంగ్రెస్‌లో చేరాలని వారితో చర్చిస్తున్నట్లు సమాచారం. తమ భవిష్యత్తుకు ఢోకాలేకుండా ముందుగానే కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడాలని కొందరు నేతలు సూచిస్తున్నట్లు వినికిడి.



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ డైట్ కళాశాల విద్యార్థినులు

కాబోయే టీచర్లం.. పాఠాలు చెప్పేటోళ్లు లేరు మేడం

మేము కాబోయే టీచర్లం.. మాకు చెప్పడానికి టీచర్లే లేరు. ఎలా చదువుకోవాలి మేడం? అంటూ ప్రభుత్వ డైట్ కళాశాల ఉర్దూ, తెలుగు మీడియం విద్యార్థినులు మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని డైట్ విద్యార్థులు కలిసి టీచర్ల కొరతను, కళాశాలలో నెలకొన్న సమస్యలను వివరించారు. అధ్యాపకులు లేక నాణ్యమైన విద్య కరువైందన్నారు. టీచర్లను కేటాయించాలంటూ వేడుకున్నారు. వారి సమస్యలను సావధానంగా విన్న మంత్రి.. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

– వికారాబాద్ అర్బన్

రైతుల నిర్బంధం



రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు



ఠాణాలో రైతులు

- పరిహారం అడిగినందుకు పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- జీవన్గీలో భూ నిర్వాసితులపై కేసు

బషీరాబాద్: పరిహారం అడిగినందుకు భూనిర్వాసితులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఆరు గంటల పాటు నిర్బంధించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. జీవన్గీలో ఓ వంతెనకు ఇరువైపులా వేస్తున్న రోడ్డుకు సంబంధించి 19 మంది రైతులు భూములు కోల్పోయారు. ప్రభుత్వం వీరికి ఎకరాకు రూ.10 లక్షల పరిహారం ఇస్తామని ఏడాది కిందటే ప్రకటించింది. అయితే ఇప్పటివరకు పరిహారం చెల్లించలేదు. మరో పక్క రెండు వారాలుగా పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పరిహారం చెల్లించి పనులు చేయాలని గురువారం భూ నిర్వాసిత రైతులు లక్ష్మప్ప, సంగారెడ్డి, అంపిరెడ్డి, మాధవ్‌రెడ్డి, నర్సిరెడ్డి రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి కోరారు. దీంతో అధికార పార్టీకి చెందిన దస్తయ్యగౌడ్, సోమశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, గోపాల్.. రైతులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న బషీరాబాద్, యాలాల పోలీసులు అక్కడికి చేరుకొని నిర్వాసిత రైతులను బలవంతంగా పోలీసు జీపుల్లో ఎక్కించి ఠాణాకు తరలించారు. సుమారు ఆరుగంటల పాటు పోలీస్ స్టేషన్‌లోనే రైతులను నిర్బంధించారు. రాత్రి 7.30 గంటలకు వారిని వదిలేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు అడ్డుకున్నందుకే ముందస్తు చర్యల్లో భాగంగా రైతులపై సీఆర్‌పీసీ 160 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.



నగరంలో మంత్రులు ఎర్రబెల్లి, జగదీశ్‌రెడ్డి, సీఎస్ శాంతకుమారి నుంచి ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకుంటున్న చీమల్‌దరి సర్పంచ్ నర్సింహారెడ్డి, కార్యదర్శి – మోమిన్‌పేట

నేటి నుంచి సదరం క్యాంపులు

తాండూరు టౌన్ : జిల్లాలో శుక్రవారం నుంచి సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికలాంగులు మీసేవ కేంద్రాల్లో వెంటనే స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. శుక్రవారం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మానసిక వికలాంగులు (ఎంఆర్), మానసిక అనారోగ్యం (ఎంఐ) గల వారి కోసం క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు తులాభారం

అనంతగిరి: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. మండల పరిధిలోని పులుమద్ది గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు బెల్లంతో తులాభారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ గ్రామాలన్నీ సుందరంగా మారడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. కార్మికులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగుల పెన్షన్ రూ.వెయ్యి పెంచిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, సర్పంచ్ మాధవరెడ్డి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పులుమద్దిలో పారిశుద్ధ్య కార్మికునికి తులాభారం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ప్రగతిబాటన పల్లెలు



మీర్జాపూర్‌లో పల్లె పకృతి వనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

- తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి
- మంత్రి సబితారెడ్డి
- మీర్జాపూర్‌లో పంచాయతీ భవనం, పల్లెప్రకృతి వనం ప్రారంభం

పూడూరు: రాష్ట్రంలో పల్లె ప్రగతి కార్యక్రమం చేపట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచారని మంత్రి సబితారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని మీర్జాపూర్‌కు వచ్చిన మంత్రికి మహిళలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డితో కలిసి నూతన పంచాయతీ భవనం, పల్లె ప్రకృతి వనం, సోలార్‌లైటింగ్ సిస్టంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలో ఊహించని అభివృద్ధి జరిగిందని అన్నారు. ప్రజలతో ప్రజాప్రతినిధులు , అధికారులు మమేకమై పల్లె ప్రగతిలో చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. నూతన పంచాయతీ రాజ్ చట్టాలను తెచ్చి గ్రామాల రూపురేఖలు మార్చారని అన్నారు. గ్రామాల్లో వైకుంఠధామాలు, పల్లె పకృతి వనాలు, క్రీడామైదానాలతో పంచాయతీలు కలకళలాడుతున్నాయని అన్నారు. రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని అన్నారు. వేసవి వస్తే మంచినీళ్లు, కరెంట్ సమస్యతో ఇబ్బందులు వచ్చేవని, ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, 24 గంటల విద్యుత్తు అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. హరితహారంలో భాగంగా ఇప్పటి వరకు 230 కోట్ల మొక్కలు నాటడంతో 7 శాతం పచ్చదనం పెరిగిందన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా రూ.7వేల కోట్లతో పాఠశాలలో వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్మన్ సునీతారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటికో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకుంటే భూగర్భజలాలు పెంపొందుతాయని అన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి , డీపీఓ తరుణ్, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచ్ రవి, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ వేయండి

వికారాబాద్ అర్బన్: డీఎస్సీ నోటిఫికేషన్ వేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఎస్, బీఎడ్ అభ్యర్థులు మంత్రి సబితారెడ్డిని కోరారు. జిల్లాకు వచ్చిన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు వారి ఇబ్బందులను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ మెగా డీఎస్సీ వేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని అన్నారు.

సారూ.. మా బాబును చేర్చుకోండి

'సారూ.. మా బాబును పాఠశాలలో చేర్చుకోండి' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు బారులు తీరుతున్నారు.. అక్కడి హెచ్ఎంను వేడుకొంటున్నారు. అంతేకాకుండా స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి సైతం ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇదంతా ఓ ప్రైవేటు పాఠశాలలో జరుగుతుందనుకుంటున్నారా.. కాదండీ బాబూ.. అన్నింటా 'నంబర్ –1'గా కొనసాగుతున్న తాండూరు పట్టణంలోని సర్కారు బడిలో..

- సర్కారు బడికి పోటెత్తిన అడ్మిషన్లు
- తాండూరులోని 'నంబర్ –1'కు క్యూకడుతున్న తల్లిదండ్రులు
- ప్రైవేటుకు దీటుగా విద్యాబోధనే కారణం



అడ్మిషన్ల కోసం వచ్చిన పిల్లలతో మాట్లాడుతున్న హెచ్ఎం వెంకటయ్య

తాండూరు రూరల్: తాండూరు పట్టణంలోని సాయిపూర్‌లో ప్రభుత్వ నంబర్–1 పాఠశాల ఉంది. సుమారు 700 మంది వరకు ఇక్కడ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం ఉంది. 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం వందల సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారు. ఇప్పటికే వంద సీట్లు పూర్తి అయ్యాయి. ఒక్కో తరగతిలో 100 నుంచి 120 మంది విద్యార్థులు ఉన్నారు. అయినా ఇంకా తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. చేర్చుకునేందుకు హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులను వేడుకుంటున్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

6వ తరగతిలో వంద మంది విద్యార్థులు (ఇంక దరఖాస్తులు వస్తున్నాయి).7లో 111, 8లో 125, 9లో 99, 10వ తరగతిలో 129 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదు తరగతులకు సంబంధించి 19 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కానీ కేవలం 14 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయని హెచ్ఎం తెలిపారు. ఫిజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌లకు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఒక్కొక్కరే ఉన్నారని చెప్పారు. అయినా ప్రైవేటు దీటుగా విద్యాబోధన అందిస్తున్నామని చెప్పారు. పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమిస్తే అద్భుత ఫలితాలు తీసుకొస్తామని తెలిపారు.

చక్కటి బోధన..

పట్టణంలోని సాయిపూర్ నంబర్–1 పాఠశాలలో చక్కటి విద్యా బోధన ఉండటంతో విద్యార్థులు ఆసక్తి చూపు తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, పైగా పట్టణం నడిబొడ్డున పాఠశాల ఉండటంతో తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.అనుభవమైన ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. మన ఊరు–మనబడి కింద రూ.52 లక్షలతో పాఠశాలలో మౌలిక సదుపాయాలు కూడా కల్పించారు.

ఉపాధ్యాయుల కృషి ఫలితమే



సాయిపూర్‌లోని ప్రభుత్వ నంబర్–1 పాఠశాలలో విద్యార్థులను చేర్చుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వద్దంటే స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి తెస్తున్నారు. 2015లో 390 విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 670 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో తరగతి గదిలో 100 మంది విద్యార్థులను కూర్చోపెడుతున్నాం. గదులు సరిపోవడంలేదు. పాఠశాలలో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన కొనసాగుతున్నది. ఇది ఉపాధ్యాయుల కృషి ఫలితమే.

– వెంకటయ్య, పాఠశాల హెచ్ఎం (ఎంఈఓ, తాండూరు)

క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

వికారాబాద్‌ అర్బన్‌: ఐఏఎస్‌ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కోటాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్‌ పబ్లిక్‌ సరీ్వస్‌ కమిషన్‌ నిర్వహించే సివిల్‌ సర్వీసెస్‌ పరీక్షలు (ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ) –2024 కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్‌ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్సియల్‌ పద్ధతిలో ఇంటిగ్రేషన్‌ గ్రాడెన్స్‌ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఆబ్జెక్టివ్‌ టైప్‌ రాత పరీక్ష, అప్టిట్యూడ్‌ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ. 3లక్షలకు మించరాదన్నారు. అభ్యర్థులు ht-t://rtudycirce.cff.gov.in లో ఈ నెల 6 నుంచి జూలై 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్‌ నంబర్‌ 6281766534లో సంప్రదించాలని కోరారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

బంట్వారం: మనస్తాపంతో వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బుధవారం రాత్రి కోట్‌పల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోట్‌పల్లికి చెందిన రాధమ్మ(28) భర్త కృష్ణ ఇద్దరు పిల్లలతో కలిసి రెండు నెలల నుంచి మహ్మదాన్‌పల్లిలోని పుట్టింట్లో ఉంటోంది. కుటుంబ కలహాలతో ఇటీవల కృష్ణ పిల్లలను తీసుకుని తాండూరులో కూలీ పనులు చేస్తు అక్కడే బంధువుల దగ్గర ఉంటున్నాడు. ఈ క్రమంలో రాధమ్మ మనస్థాపంతో కోట్‌పల్లికి వెళ్లి పురుగుల మందు తాగి చనిపోయింది. రాధమ్మ ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ రావడంతో తల్లి పద్మమ్మ అనుమానంతో కోట్‌పల్లికి వెళ్లి చూడగా కూతురు చనిపోయి ఉంది. పోలీసులకు సమాచారం ఇచ్చింది. వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్‌ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు



ట్రాక్టర్‌ ఢీ కొనడంతో అపస్మారక స్థితిలో వృద్ధుడు

తాండూరు రూరల్‌: ట్రాక్టర్‌ ఢీ కొనడంతో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గౌతపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గౌతపూర్‌లో నివాసం ఉంటున్న వృద్ధుడు మధ్యాహ్నం రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గౌతపూర్‌ నుంచి వస్తున్న ట్రాక్టర్‌ ఢీకొట్టింది. వృద్ధుడి తలకు తీవ్ర గాయమైంది. 108లో తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులను తిలకిస్తున్న కమిషనర్‌ శరత్‌చంద్ర

వికారాబాద్‌ అర్బన్‌: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పట్టణ ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకొని పురపాలక సంఘం కార్యాలయం వద్ద మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని చక్కటి రంగురంగుల ముగ్గులు వేశారు. ఇవి చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాల పరిశీలన

తాండూరు రూరల్‌: కలెక్టర్‌ ఆదేశాల మేరకు తాండూరు తహసీల్దార్‌ చిన్నప్పల నాయుడు పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించారు. గురువారం మండలంలోని జినుగుర్తి, సంకిరెడ్డిపల్లి, ఉద్దాండపూర్‌, మిట్టబపల్లి పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించారు. సదుపాయాలపై నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్‌ తెలిపారు.

ఇక ద్రవరూప ఎరువులు

- గతంలో గుళికల రూపంలో యూరియా
- ప్రస్తుతం ద్రవరూపంలో యూరియా, డీఏపీ
- వినియోగం పెరిగితే రైతులకు తగ్గనున్న ఆర్థిక భారం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ద్రవరూపంలోని డీఏపీ

వికారాబాద్‌ అర్బన్‌: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నట్లే వ్యవసాయ రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, రైతులకు ఆర్థిక ఇబ్బందులు తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎరువుల ఖర్చును తగ్గించే ప్రయత్నం చేస్తోంది. గతంలో పంటలకు వేసే డీఏపీ, యూరియా గుళికల రూపంలో ఉండేది. ఒక్కోటి 50 కేజీల బస్తా మార్కెట్లో అందుబాటులో ఉండేవి. ఇప్పుడు అవే యూరియా, డీఏపీ ఎరువులను ద్రవ రూపంలో తీసుకొచ్చాయి. రెండేళ్ల క్రితమే నానో యూరియా మార్కెట్లోకి రాగా త్వరలో ద్రవరూపంలో ఉండే డీఏపీ కూడా అందుబాటులోకి వస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగనుంది.

ఎరువులు కొనడమే ఆర్థిక భారం

పంటలు వేసే సీజన్‌ ప్రారంభమైదంటేనే రైతులకు ఆర్థిక కష్టాలు మొదలవుతాయి. ప్రధానంగా యూరియా, డీఏపీ వంటికి కొని మార్కెట్‌ నుంచి ఇంటికి తరలించడం, ఇంటి నుంచి పొలానికి తరలించడం వ్యయంతో కూడుకున్న పని. పైగా కొన్ని సార్లు యూరియా, డీఏపీ బ్లాక్‌ మార్కెట్‌లో కొనాల్సి రావడంతో అధిక ధరలు వెచ్చించక తప్పదు. దీంతో రైతుల అంచనాలు కొన్ని సార్లు తలకిందులు అవుతుంటాయి. ఇప్పుడు రైతులకు ఆ పరిస్థితి రాకుండా కేంద్ర ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. (ఇఫ్‌కో) ఇండియన్‌ ఫార్మర్స్‌ ఫర్టిలైజర్స్‌ కో–ఆపరేటివ్‌ లిమిటెడ్‌, గతంలోనే నానో యూరియాను ద్రవరూప ఎరువును అందుబాటులోకి తెచ్చింది. గత నెల 26న ఢిల్లీలోని ఇఫ్‌కో సదన్‌లో నానో డీఏపీని కూడా మార్కెట్‌లోకి విడుదల చేశారు. తొలిసారి ప్రపంచంలో యూరియా,

డీఏపీని ద్రవరూపంలో తయారు చేయడంతో రైతులకు ఎంతో మేలు జరుగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రసాయన ఎరువులతో నష్టం

ఏళ్ల తరబడి కొన్ని రకాలైన పంటలకు రసాయన ఎరువులను అధిక మోతాదులో రైతులు వినియోగిస్తున్నారు. అధికంగా రసాయనిక ఎరువులు వాడటం మంచిది కాదని తెలిసినా గత్యంతరం లేక రైతులు వాటినే ఉపయోగిస్తున్నారు. అధిక రసాయనిక ఎరువులు ఉపయోగం రైతుల ఆరోగ్యానికి కూడా పెద్ద ముప్పుగా మారిందని భావించిన కేంద్ర ప్రభుత్వం ద్రవరూప నానోయూరియా, డీఏపీని తయారు చేయాలని భావించింది. నానో డీఏపీతో పంటల్లో దిగుబడి పెరగనుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

ఖర్చు తక్కువ

ఎకరానికి అర లీటర్‌ నానో డీఏపీ సరిపోతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. స్ప్రేయర్లతో పిచికారీ చేస్తే పొలం మొత్తానికి బలం చేకూరే అవకాశం ఉందని తెలిపారు. ఒక రైతు ఒక డీఏపీ బస్తా వేయాలంటే రూ. 1760 ఖర్చు వస్తుంది. అదే అర లీటర్‌ నానో డీఏపీ వేస్తే కేవలం రూ. 600 మాత్రమే ఖర్చు అవుతుంది. అంటే ఒక రైతుకు రూ. 1160 మిగుల నుంది. అర లీటర్‌ నానో డీఏపీ, యూరియా డబ్బాలు 50 కేజీల బస్తాతో సమానం. ఎకరానికి అర లీటర్‌ నానో డీఏపీ, యూరియా సరిపోతుంది. పైగా నానో డీఏపీలో అదనంగా పోషకాలు సైతం ఉండటంతో పంట దిగుబడి మరింత పెరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే నానో యూరియా మార్కెట్‌లోకి వచ్చినా దాన్ని ఉపయోగించేందుకు రైతులు సుముఖత చూపడం లేదు. ఈ కారణంగా వ్యాపారులు కూడా నానో యూరియా, డీఏపీని తెప్పించడం లేదు. జిల్లాలో ఒకటి రెండు దుకాణాల్లో తప్ప మిగత చోట్ల లభించడం లేదు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు చొరవ తీసుకుంటే నానో ఎరువుల ఉపయోగం పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

“ అవగాహన కల్పిస్తాం



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంటల సాగుకు ద్రవరూపంలోని యూరియా, డీఏపీ ఉపయోగించాలని రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. డీఏపీ, యూరియాల బస్తాలకంటే ఈ ద్రవరూప ఎరువుల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. వీటి ఉపయోగంతో రైతుకు కూడా ఆర్థిక లాభం చేకూరుతుంది. అయితే రెండేళ్లుగా నానో యూరియా అందుబాటులో ఉంది. కొందరు రైతులు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఈ ఏడాది నానో డీఏపీ కూడా రావడంతో అవగాహన కార్యక్రమాలు చేపడతాం. ప్రస్తుతం జిల్లాలో పరిగి, వికారాబాద్‌లో ఒకటి రెండు ఫెర్టిలైజర్‌ దుకాణాల్లోనే నానో యూరియా అందుబాటులో ఉంది. వాటి సంఖ్యను మరింత పెంచుతాం. నానో యూరియా, డీఏపీ ఉపయోగంపై రైతులకు ఎలాంటి అనుమానం అవసరం లేదు. గుళికల ఎరువు కంటే చాలా మేలైనది.

– గోపాల్‌, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

నీట్‌లో విద్యార్థినుల ప్రతిభ


చందు/451


సుమిత్ర/422


నవనీత/412


శివామృత/406


మంజుల/383

వికారాబాద్‌ అర్బన్‌: నీట్‌ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ పి.అపర్ణ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన చందు – 451, సుమిత్ర – 422, నవనీ – 412, శివామృత – 406, మంజుల – 383 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థినులు మంచి మార్కులు సాధించడంలో కళాశాల అధ్యాపకుల కృషి ఎంతో ఉందని తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం

- రెండో రోజూ మైన్స్, రెవెన్యూ అధికారుల దాడులు
- నది మధ్యలో వేసిన ర్యాంప్‌ తొలగింపు
- తెలంగాణ భూ భాగంలో తవ్వితే కేసులు నమోదు చేస్తాం
- కర్ణాటక కాంట్రాక్టర్‌ను హెచ్చరించిన తహసీల్దార్‌ వెంకటస్వామి



ర్యాంపును జేసీబీతో తొలగిస్తున్న రెవెన్యూ, మైన్స్‌ అధికారులు

బషీరాబాద్‌: కాగ్నానదిలో కన్నడిగులు చేస్తున్న ఇసుక దోపిడీపై తెలంగాణ అధికారులు ఉక్కుపాదం మోపారు. నదీలో సగభాగం వాటా మాటున అక్కడి ప్రభుత్వం మూడు నెలల కిందటా ×కర్ణాటక రూరల్‌ డెవిల్‌మెంట్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ లిమిటెడ్‌ గుల్బర్గా× పేరున ఓ కాంట్రాక్టర్‌ ఇసుక తవ్వకాలపై లీజు ఇచ్చింది. లీజు మాటున నది మధ్య భాగంలో కాంట్రాక్టర్‌ ర్యాంపు వేశాడు. ర్యాంపుపై నుంచి పెద్ద పెద్ద హిటాచీలతో తెలంగాణ నదీ భాగంలో భారీగా ఇసుక తవ్వకాలు జరిపి నదీ ఒడ్డున భారీగా ఇసుక నిల్వలు చేస్తున్నారు. అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు ఇసుకను దర్జాగా తరలిస్తున్నారు. ఇదే విషయమై సాక్షి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో కలెక్టర్‌ ప్రత్యేక దృష్టి సారించారు. కాగ్నాలో ఇసుక దోపిడీ జరిగితే మీరే బాధ్యులవుతారని రెవెన్యూ, మైన్స్‌ అధికారులకు కలెక్టర్‌ హెచ్చరించారు. దీంతో రెండు రోజులుగా కాగ్నాలో దాడులు చేస్తున్నారు. తహసీల్దార్‌ వెంకటస్వామి, తాండూరు మైన్స్‌ టెక్నికల్‌ అసిస్టెంట్‌ మహాలక్ష్మి, ఆర్‌ఐ రాకేష్‌, వీఆర్‌ఏల బృందం గురువారం హల్కోడ దగ్గర కర్ణాటక కాంట్రాక్టర్‌ చేపట్టిన తవ్వకాల ప్రాంతానికి వెళ్లారు. నది మధ్యలో వేసిన ర్యాంపును జేసీబీతో తొలగించారు. అధికారులు అక్కడికి వెళ్లిన సమయంలో కర్ణాటక కాంట్రాక్టర్‌ వాహనాలు కానీ, మనుషులు కాని అక్కడ కనిపించలేదు. అధికారులు దాడులు చేస్తున్నారని ముందు పసిగట్టి రెండు రోజులుగా ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. అక్కడి ప్రభుత్వ అనుమతులు ఉంటే తాము వెళ్లినప్పుడు ఎందుకు భయపడి పనులు బంద్‌ చేస్తారని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఇక నుంచి వీఆర్‌ఏలను నిత్యం కాపల పెడుతున్నట్లు తహసీల్దార్‌ తెలిపారు. ఇకపై అక్రమంగా తవ్వకాలు జరిపితే వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కేసీఆర్‌ హయాంలోనే అభివృద్ధి



రంగాపూర్‌లో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఒకప్పుడు దుర్భర స్థితిలో ఉన్న గ్రామాలు కేసీఆర్‌ సీఎం అయ్యాక అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని రంగాపూర్‌లో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండేవన్నారు. కానీ నేడు గ్రామాలు పట్టణాల తరహాలో అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. అనంతరం రంగాపూర్‌లో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌, నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పల్లె ప్రగతి’తో గ్రామాలకు మహర్దశ

ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌

మోమిన్‌పేట: పల్లె ప్రగతి కార్యక్రమంతో ద్వారా గ్రామాల రేఖలు మారాయని ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ అన్నారు. గురువారం మండలంలోని గోవిందాపూర్‌లో రూ. 20లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. రూ. 35లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం పల్లెప్రగతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించినట్లు తెలిపారు. మిషన్‌ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్‌ ఆశమ్మ, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ శ్రీకాంత్‌గౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్‌, నాయకులు తిరుపతిరెడ్డి, భిక్షపతి, మైపాల్‌, రాజు, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

అనంతగిరి: వికారాబాద్‌ మండలం కామరెడ్డిగూడలో పంచాయతీ నూతన భవనానికి గురువారం ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త జీపీల ఏర్పాటు ద్వారా సీఎం కేసీఆర్‌ ప్రజలకు పాలనను చేరువ చేశారని పేర్కొన్నారు. నేడు గ్రామాలన్నీ అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, ఆర్‌డీఓ విజయకుమారి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్‌ పురుషోత్తంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శిల్ప తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: గోవిందాపూర్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌ తదితరులు

యథేచ్ఛగా సారా తయారీ

- కాగ్నాకు ఇరువైపులా బట్టీల ఏర్పాటు
- ధారూరు సంతలో ప్యాకెట్ల విక్రయం
- ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలు
- పట్టించుకోని ఎక్సైజ్‌ శాఖ



కాగ్నా నదీ పరీవాహక ప్రాంతంలో సారా తయారీ

ధారూరు: మండలంలోని పలు తండాల్లో సారా బట్టీల ఏర్పాటు, తయారీ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా సారా బానిసలే దర్శనమిస్తున్నారు. నిత్యం రోడ్లపై తూలి పడిపోతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ, ఉపాధి కూలీలే సారాను అధికంగా తాగుతున్నారు. సారాను ప్రభుత్వం నిషేధించినా ఫలితం లేకుండా పోతోంది. మండలంలోని మైలారం, లక్ష్మనగర్‌ తండా, నాగ్‌సాన్‌పల్లి, రాంపూర్‌ తండా, గట్టెపల్లి తండా, తిమ్మానగర్‌ తండా, మైలారం కొత్తతాండ, నాగసమందర్‌ తదితర గ్రామాల తోపాటు పెద్దేముల్‌ మండలం మదనంతాపూర్‌ తండాలో సారా తయారీ విచ్చలవిడిగా సాగుతోంది. ప్రస్తుతం అమ్మకాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.

ధారూరు సంతలో సారా చింత

మండల కేంద్రంలో ప్రతి శనివారం సంత జరుగుతుంది. ఇక్కడ సారా ప్యాకెట్ల ప్రవాహం యథేచ్ఛగా సాగుతోంది. ఒక్కో ప్యాకెట్‌ను రూ. 10నుంచి రూ. 25 వరకు విక్రయిస్తున్నారు. ఒక్కో వ్యక్తి సంత రోజు రూ. 3వేల నుంచి రూ. 5వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నారంటే పరిస్థితి ఎంతలా మారిందో అర్థం చేసుకోవచ్చు. వాగులు, నదులు, నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో సారా బట్టీలను ఏర్పాటు చేసి తయారు చేస్తున్నారు. చిన్న చిన్న ప్యాకెట్లలో సారాను నింపి ప్రతిరోజూ తెల్లవారుజామున గ్రామాల్లోని అమ్మకం దారులకు ఇచ్చి వెళుతున్నారు. మామూళ్ల మత్తులో ఎక్సైజ్‌ శాఖ ఉండడంతో వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు సారా కట్టడికి చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బైక్‌కు మంటలు



కాలిపోతున్న దుస్తుల బ్యాగ్‌, బైక్‌

నందిగామ: బైక్‌ వెనుక భాగంలో దుస్తుల బ్యాగ్‌ తగిలించుకొని వెళ్తుండగా సైలెన్సర్‌ వేడికి ఆ బ్యాగ్‌కు మంటలు వ్యాపించి బైక్‌ కాలిపోయింది. ఈ ఘటన మండలంలోని చాకలిగుట్ట తండా సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు చెప్పడానికి ఇష్టపడని దంపతులు బైక్‌పై షాద్‌నగర్‌ వైపు నుంచి హైదరాబాదు వైపునకు వెళ్తున్నారు. బైక్‌ వెనుక ఉంచిన దుస్తుల బ్యాగ్‌కు సైలెన్సర్‌ వేడికి మంటలు వ్యాపించాయి. మంటల తీవ్ర రూపం దాల్చడంతో ఆ మార్గంలో వెళ్తున్న కొందరు గమనించి బైక్‌పై వెళ్తున్న వారికి చెప్పారు. దీంతో ఆ దంపతులు బైక్‌ను ఆపేశారు. మంటలు తీవ్ర రూపం దాల్చడంతో నీళ్లు చల్లి ఆర్పారు. బైక్‌పై వెళ్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్‌ అంజాద్‌

కొడంగల్‌: మండలంలోని పర్సాపూర్‌లో గురువారం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ అంజాద్‌ మాట్లాడుతూ.. కరోనా సమయంలో వారి సేవలు మరువలేనివని కొనియాడారు. నిత్యం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు.

సాంకేతిక లోపం.. ఓపెన్‌ కాని వెబ్‌సైట్‌

- లక్ష ఆర్థిక సాయం దరఖాస్తుదారులకు తిప్పలు
- మీ–సేవ కేంద్రాల్లో పడిగాపులు



మీసేవ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న జనం

దౌల్తాబాద్‌: బీసీ కులవృత్తుల వారు, అలాగే చేతి వృత్తుల వారు రూ. లక్ష ఆర్థిక సహాయం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అవస్థలు పడుతున్నారు. మీసేవ కేంద్రాల్లో సాంకేతిక లోపం కారణంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు యత్నిస్తుంటే సబ్‌మిట్‌ కావడం లేదు. దీంతో అర్హులు మీ సేవ కేంద్రం వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగి పోతున్నారు.

మండలంలో వివరాలు

- బీసీల్లో 15 కుల, చేతివృత్తులు చేసుకునే వారికి ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే, ఈ పథకానికి ఈ నెల 6నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికార యంత్రాంగం ప్రకటించింది.
- ఇందుకుగాను ప్రత్యేకవె వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తు తీసుకుంటున్నారు. సాధారణంగా ఇతర పథకాల కోసం చేసుకునే దరఖాస్తుల్లో మండలం వివరాలు ఉండవు.
- కానీ గ్రామం, మండలం జిల్లా వివరాలు ఉంటాయి. కానీ ఈ దరఖాస్తు కోసం ప్రత్యేకంగా నియోజకవర్గం పేరును నమోదు చేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తుదారుని కుటుంబ సభ్యులందరి పేర్లు, వారి ఆధార్‌ కార్డు నంబర్లు, రేషన్‌ కార్డు నంబర్‌ వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.

ముడిసరుకులు కూడా కొనుగోలు చేయవచ్చు

- ఈ పథకం కింద ఇచ్చే రూ. లక్షతో లబ్ధిదారులు వారి చేతి, కులవృత్తులకు అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసుకోవచ్చు. అలాగే అవసరమైన ఉపకరణాలను కూడా కొనుగోలు చేసుకునేందుకు వీలుంటుంది.
- వీటికి ఈ ఆర్థిక సహాయాన్ని ముడి సరుకులు కూడా కొనుగోలు చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. ఈ కొనుగోలు చేసిన బిల్లులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది.
- మండల ప్రత్యేకాధికారి ఈ యూనిట్లు గ్రౌండింగ్‌ను పర్యవేక్షించాల్సి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఐదేళ్లలోపు పొందిన వారు అనర్హులు

- బీసీ కార్పొరేషన్‌ ద్వారా గానీ, బీసీ సంక్షేమ శాఖ ద్వారా గానీ గత ఐదేళ్లలో రూ. 50వేలు అంతకంటే ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అనర్హులుగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది.
- లబ్ధిదారుల వార్షిక ఆదాయం రూ.1.50లక్షల లోపు ఉండాలి.

పల్లె ప్రగతితో అభివృద్ధి పరుగులు



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న వృద్ధురాలు

కొడంగల్‌: పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పర్సాపూర్‌, దుద్యాల మండలం ఆలేడులో పల్లె ప్రగతి ఉత్సవాలు జరిగాయి. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్‌ అధిక నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేశ్‌ముఖ్‌, సర్పంచ్‌ అంజాద్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



పిల్లలతో అక్షరాలు దిద్దిస్తున్న హెచ్‌ఎం నర్సింహులు, స్కూల్‌ చైర్మన్‌ సత్యనారాయణ

దోమ: మండలలోని శివారెడ్డిపల్లి పాఠశాలలో గురువారం హెచ్‌ఎం సి.నర్సింహులు, స్కూల్‌ చైర్మన్‌ సత్యనారాయణ విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా పాఠశాలలో చేరిన చిన్నారులతో పలకలపై అక్షరాలను దిద్దించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.